తప్పుల తడకగా సాధారణ బదిలీలు

- సరైన గైడ్‌లైన్స్, స్పష్టత లేని కారణంగా ఉద్యోగుల ఇబ్బందులు
- డీహెచ్ పరిధిలో తప్పుల తడకగా సీనియారిటీ లిస్ట్: ఉద్యోగులు
- అవకతవకలకు పాల్పడ్డ అధికారులను తక్షణమే భర్తరఫ్ చేయాలి

కోఠిలోని డీహెచ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

సుల్తాన్ బజార్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖలో ఓ విధానం లేకుండా తప్పుల తడకగా నిర్వహిస్తున్నారని, అన్ని క్యాడర్ల ఉద్యోగులు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం ముందు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు గురువారం నర్సింగ్ ఆఫీసర్స్, ఎంపీహెచ్ఎస్, సీహెచ్‌వో, మేల్, ఫిమేల్ ఎంపీహెచ్‌వోలతో ఇతర క్యాడర్ల ఉద్యోగులు పెద్ద ఎత్తున కోఠిలోని డీహెచ్ కార్యాలయానికి చేరుకొని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగుల వద్దకే వచ్చిన డీహెచ్ డాక్టర్ రవీంద్ర నాయక్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు తెలిపిన వాటిని క్షుణ్ణంగా విన్న డీహెచ్ ఉద్యోగులు ఎవరికి అన్యాయం జరుగదని, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పలు క్యాడర్ల అసోసియేషన్ ప్రతినిధులు కర్నాటి సాయిరెడ్డి, భరత్, సత్యనారాయణ, మరియమ్మ, భూపాల్, రాజశేఖర్, హరి శంకర్, భరత్ మాట్లాడుతూ ఏఎన్ఎం నుంచి మెడికల్ ఆఫీసర్ల వరకు సాధారణ బదిలీలలో అవకతవకలు పాల్పడుతున్న అధికారులను తక్షణమే భర్తరఫ్ చేయాలన్నారు. రాత్రి 11 గంటల సమయంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విడుదల చేసిన సీనియర్ లిస్టు పూర్తిగా తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. నాలుగేండ్ల సీనియారిటీ ఉన్న వారికి 14 ఏళ్ళు ఉన్నట్లుగా, 12 ఏళ్ళు ఉన్న వారికి 10 ఏళ్ళు ఉన్నట్లుగా, అంతే కాకుండా చనిపోయిన వారు, రిటైర్డ్ అయిన వారి పేర్ల లిస్టులో ఉండటమేమిటని వారు ప్రశ్నించారు. సాధారణ బదిలీలను జూలై 3 నుంచి 20వ తేదీలోపే ఇంత త్వరగా ప్రభుత్వం ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో ఉద్యోగులకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతలపై ఉందని అన్నారు. బదిలీల విషయంలో ఉద్యోగులకు స్పష్టత లేదన్నారు. జీవో నం.80 ప్రకారం, వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం బదిలీలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న తరుణంలో ఉద్యోగులకు సరైన గైడ్‌లైన్స్, స్పష్టమైన విధానాలను ఉద్యోగులకు తెలపకపోవడంతో వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. అన్ని క్యాడర్లలో సీనియారిటి ఫైనల్ లిస్ట్‌ను పెట్టకుండా ఆ లిస్టును ఉద్యోగులకు చూపకుండా, 317 జీవోతో పాటు ఉద్యోగులకు ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ఎలా బదిలీలు చేస్తారని? వారు ప్రశ్నించారు. రాష్ట్ర వాప్తంగా ఉన్న ఉద్యోగుల గ్రీవెన్స్ సర్టిఫికెట్లను కిటికీల ద్వారా తీసుకోవడంతో క్యూలైన్‌లో ఉద్యోగులను నిలబెట్టి అవమానపరుచడం ఎంత వరకు సమంజసమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీహెచ్ పరిధిలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులను తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ బదిలీల సమయాన్ని పొడిగించి బదిలీల ప్రక్రియలో అన్యాయం జరుగకుండా చూడాల్సిన భాధ్యత రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తులు ప్రత్యేక చొరవ తీసుకొని సీనియారిటీ ప్రకారం పారదర్శకంగా బదిలీలను నిర్వహించాలని వారన్నారు.

ఉచిత ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ శిక్షణ

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (డీఎంఎస్‌కేవీ) ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ శిక్షణ నైపుణ్యాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. 18-45 మధ్య ఉన్న మహిళలు ఆధార్ కార్డుతో తమను సంప్రదించాలని కోరారు. ప్లేస్‌మెంట్ కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కాలం 45 నుంచి 60 రోజుల పాటు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల మహిళలు డీఎంఎస్‌కేవీ మేనేజర్ ఫోన్ నం. 76600 22507 లేదా కూకట్‌పల్లిలోని మోవో టీం. 89780 99499లో సంప్రదించొచ్చని తెలిపారు.

కార్గో ఏజెంట్ల నియామకం

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్(కార్గో) గ్రేటర్ హైదరాబాద్ జోన్ విభాగంలో ఏజెంట్ల నియామకం జరుగుతుందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎస్.మధుసూదన్ గురువారం పేర్కొన్నారు. ప్రతి ఏజెంట్ రూ.10,000 లు చెల్లించాల్సి ఉంటుందని, ఒక్క పార్సిల్‌పై 15 శాతం కమిషన్ ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రతి ఏజెంట్ కంప్యూటర్, ప్రింటర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 91542 98781, 91542 98828, 89195 25373లో సంప్రదించి తెలుసుకోవచ్చని వివరించారు.

విద్యార్థులకు ప్రతిభా పుస్కారాలు

కాచిగూడ, జూలై 11: మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో 2023 - 24వ విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పుస్కారాలను ప్రదానం చేస్తున్నారు. ఇందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 12 నుంచి కాచిగూడలోని మున్నూరు కాపు భవన్‌లో గల ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో దరఖాస్తులను తీసుకొని పూర్తి చేసి 31వ తేదీలోపు అందజేయాలని కోరారు. దూర ప్రాంత విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 94916 27404లో సంప్రదించాలని కోరారు.

ఐఐసీటీ సైంటిస్ట్‌కు టెక్ శ్రీ అవార్డు

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సైంటిస్టు డాక్టర్ ఏవీ శేష సాయినాథ్‌కు అసోసియేషన్ ఫర్ క్వాలిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ జాతీయ స్థాయిలో ఇచ్చే టెక్ శ్రీ అవార్డుతో సత్కరించింది. జాతీయ స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విశేష సేవలందించే నిపుణులను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఈ నేపథ్యంలో పలు కీలక పరిశోధనల్లో ముఖ్యపాత్ర పోషించి శేషసాయికి ఈ అవార్డు రావడంపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

పేటెంట్ పరీక్షకులుగా ఓయూ విద్యార్థుల ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పది మంది విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ పేటెంట్ పరీక్షకులుగా ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయంలో పేటెంట్, డిజైన్ పరీక్షకులు (గ్రూప్ ఏ) పోస్టులు జాతీయ స్థాయిలో 53 పోస్టులకు గాను పరీక్షలు జరగగా, అందులో పది మంది ఓయూ విద్యార్థులే ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా వారిని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ మాలిని, డాక్టర్ సుమన్ అభినందించారు.

కూకట్‌పల్లిలో అంకుర 120 పడకల ఆస్పత్రి

- మహిళలు, పిల్లలకు ఆరోగ్య సేవలందించడంలో వీరి కృషి అభినందనీయం
- హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర రాజ నరసింహ

జూబ్లీహిల్స్, జూలై 11: మహిళలకు, పిల్లలకు అత్యున్నతమైన ఆరోగ్య సేవలు అందించడంలో అంకుర హాస్పటల్స్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతికల శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ అన్నారు. కూకట్‌పల్లిలో అంకుర హాస్పిటల్స్ నూతనంగా ఏర్పాటు చేసిన 120 పడకల మహిళ, శిశు సంరక్షణ ఆస్పత్రిని మంత్రి దామోదర రాజ నర్సింహ గురువారం ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషాలలో 14 ప్రపంచ స్థాయి అంకుర, 9 ఎంబై అంకుర హాస్పటల్స్ ఉన్నాయని యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించారు. ఆధునిక వసతులతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అంకుర కేంద్రాలు లక్షలాది మంది విశ్వాసాన్ని చూరగొన్నాయన్నారు. తాజాగా డిజటలైజ్డ్ సెంటర్లుగా అభివృద్ధి చెందిన అంకుర కేంద్రాలు అన్ని వయస్కుల మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన రీతిలో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి అసాధారణమైన వైద్య సేవలను అందించడానికి నిబద్ధతను కలిగి ఉందని వెల్లడించారు. కేపీహెచ్‌బీలో 12 ఏండ్లుగా అంకుర హాస్పటల్ నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నదన్నారు. లెవల్ -3 ఎన్ఐసీయూ, పీఐసీయూ, ఆధునిక, సౌకర్యవంతమైన బర్తింగ్ సూట్‌లతో పాటు 24 గంటల అత్యవసర సేవలందిస్తుదని వెల్లడించారు. అదనంగా ప్రత్యేకమైన అంబులెన్స్ సేవలతో పాటు నిపుణులైన శిశు వైద్యులు, ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్ట్‌లు, మహిళలు, పిల్లల కోసం పీడియాట్రిక్, రుమటాలజీ, ఇమ్యూనాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, హెమటాలజీ, ఆర్థోపెడిక్స్, ఎండోక్రైనాలజీ వంటి అరుదైన స్పెషాలిటీస్‌తో వివిధ సూపర్ స్పెషాలిటీ బృందాన్ని కలిగి ఉన్నట్లు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఎన్ఐసీయూ, పీడియాట్రిక్, యూరాలజీలో అధిక విజయాలను సాధించడం ద్వారా మంచి గుర్తింపుతో పాటు విశ్వసనీయతను పొందినట్లు తెలిపారు.

జియోఫిజిక్స్ టెక్నికల్ గ్లోబల్ వైస్ చైర్మన్‌గా ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త

డా. సుభాష్ చంద్ర

ఉప్పల్, జూలై 11: సొసైటీ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్ నియర్ సర్వేస్ జియోఫిజిక్స్ టెక్నికల్ సెక్షన్‌కి రెండేళ్ల కాలానికి గ్లోబల్ వైస్ చైర్మన్‌గా ఉప్పల్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ)లో ముఖ్య శాస్త్రవేత్తగా పని చేస్తున్న డాసుభాష్ చంద్ర ఎన్నికయ్యారు. వ్యూహాత్మక దృష్టిని అభివృద్ధి చేయడం, అమలు చేయడం, సాంకేతిక విభాగం కార్యకలాపాలను నిర్వహించడంలో పాల్గొంటారు.

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌పై ఆరోపణలు అవాస్తవం

స్పష్టం చేసిన బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ కెరటం, తుంగతుర్తి అభివృద్ధి ప్రదాత, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌పై పలువురు విద్యార్థి నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని బీఆర్ఎస్వీ నాయకులు స్పష్టం చేశారు. ఓయూ లా కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజకీయ నేతలుగా మారిన విద్యార్థి నాయకులు మానవతా రాయ్, పున్న కైలాష్ నేత, చారకొండ వెంకటేశ్‌లపై మండిపడ్డారు. గాదరి కిశోర్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఆయన కడిగిన ముత్యం లాంటి వాడని చెప్పారు. దీనిని పునరావృతం చేస్తే బట్టలు విప్పి ఆర్ట్స్ కళాశాల ముందు నిలబెడతామని హెచ్చరించారు. ఓయూ విద్యార్థులు బీరు, బిర్యానీలకు ఆశపడతారని రేవంత్‌రెడ్డి అన్నప్పుడు వీళ్లంతా ఎక్కడ పడుకున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు స్వామి, సతీశ్, జహీర్‌ఖాన్, అవినాశ్, యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, రాజు, నాగయ్య, మిథున్ ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం నినదిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌పై ఆరోపణలు చేస్తున్న విద్యార్థి నాయకులపై మండిపడిన బీఆర్ఎస్వీ నేతలు

కొనసాగుతున్న ఎంపికలు

స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్..

రాష్ట్ర క్రీడా పాఠశాలలో 2024-25వ విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతికి సంబంధించి ఎంపికలు జరుగుతున్నాయి. తూంకుంట మున్సిపాలిటీ హకీంపేటలోని క్రీడా పాఠశాలలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ గురువారం సైతం కొనసాగాయి. గ్రూప్ - 4లో యాదాద్రి భువనగిరి, జనగామా, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల విద్యార్థులకు సెలక్షన్స్ స్కూల్ ఓఎస్‌డీ సుధాకర్ రావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కాగా, విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ, ఫ్లైయింగ్ స్టార్ట్, 6 నుంచి 10 మీటర్లు రన్నింగ్, షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, స్టాండింగ్ బోర్డ్ జంప్, 800 మీటర్లు రన్నింగ్, మెడికల్ టెస్టులు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అఫీసర్ రతన్ బోస్, డీవైఎస్ఎవో హన్మకొండ అశోక్, అడ్మినిస్ట్రేటర్ గోకుల్, కోచ్‌లు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

– శామీర్‌పేట, జూలై 11

శ్మశానానికి 120 ఎకరాల ఘనత కేసీఆర్‌దే

- మసియుల్లాఖాన్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్

అబిడ్స్, జూలై 11: ముస్లింల గ్రేవ్‌యార్డ్‌ల కోసం 120 ఎకరాల భూమిని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేటాయిస్తే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వారికి నేటికి స్థలాలు చూపక పోవడం విచారకరమని వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మసియుల్లాఖాన్, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎంకే బద్రుద్దీన్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు హజ్ హౌస్‌లో వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనిని కలిసి కేటాయించిన గ్రేవ్ యార్డుల స్థలాన్ని వెంటనే వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. మైనార్టీల సంక్షేమానికి పాటు పడిన ఏకైక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించడం జరిగిందన్నారు. అదే విధంగా అనాథ బాలల కోసం నాంపల్లిలోని అనిసుల్ గుర్బా అనాథ శరణాలయాన్ని విస్తరించేందుకు గాను ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించడంతో పాటు 40 కోట్లు వెచ్చించి భారీ భవనాన్ని నిర్మిస్తే ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బోర్డు మీటింగ్‌లో కూడా పెట్టకుండా టెమ్రిస్‌కు తక్కువ రేటుకు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. హజ్ హౌజ్ విస్తరణకు గాను పక్కనే ఉన్న భవన నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదల చేయగా పనులను ప్రారంభించలేదని, వెంటనే పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాసిత్ తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనికి బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎంకే బద్రుద్దీన్, బాసిత్‌లతో కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్

వయో పరిమితి సడలింపుపై త్వరలో తీపి కబురు

- ఉన్నత విద్యా సంస్థల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లు
- విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఐదేండ్ల వయో పరిమితి సడలింపు

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్‌పేట, జూలై 11: ఉన్నత విద్యా సంస్థల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లు, ఆయా విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఐదేండ్ల వయో పరిమితి సడలింపు విషయమై త్వరలోనే వికలాంగులు ప్రభుత్వం నుంచి తీపి కబురును వింటారని రాష్ట్ర వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వికలాంగుల హక్కుల చట్టం-2016, సెక్షన్ - 32 ప్రకారం, ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యా సంస్థల్లో వికలాంగులకు ఐదు శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లు కల్పించాలని, ఆయా విద్యా సంస్థల్లో ప్రవేశాలకు గరిష్ట వయో పరిమితిని ఐదేండ్లకు పెంచటం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో విడుదల చేయించేందుకు తాను తీవ్రంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే వికలాంగులు ఈ విషయంపై తీపి కబురును అందుకోనున్నారని ఆయన పేర్కొన్నారు. వికలాంగ సమాజం ఆత్మగౌరవంతో బతికేలా చేయటమే తన ముందున్న లక్ష్యమన్నారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం, ప్రభుత్వం తనకు వికలాంగులకు సేవచేసే భాగ్యాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని వికలాంగుల సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

క్యాన్సర్ రోగులకు రీ కన్‌స్ట్రక్షన్‌తో కొత్త రూపం

- డాక్టర్ పలుకూరి లక్ష్మి

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): ఓరల్, బ్రెస్ట్ క్యాన్సర్ రోగులకు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా కొత్త రూపం ఇవ్వవచ్చని, ప్రస్తుతం, చాలా మంది రోగులకు క్యాన్సర్ చికిత్స తరువాత ప్లాస్టిక్ సర్జరీ చేస్తున్నట్లు ఉస్మానియా దవాఖాన ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ అవగాహన వారోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన గురువారం నర్సింగ్ సిబ్బందికి ప్లాస్టిక్ సర్జరీ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.లక్ష్మి మాట్లాడుతూ, ప్రధానంగా ఓరల్ క్యాన్సర్ రోగులకు ముఖ భాగంలో క్యాన్సర్ ప్రభావితమైన భాగాన్ని తొలగించడం జరుగుతుందని, ఆ తొలగించిన భాగాన్ని ప్లాస్టిక్ సర్జరీ ద్వారా పునర్ నిర్మాణం చేస్తారన్నారు. అంతే, కాకుండా రొమ్ము క్యాన్సర్ బాధితులకు సైతం కొన్ని సందర్భాలలో రొమ్మును తొలగించాల్సి వచ్చినప్పుడు కూడా ప్లాస్టిక్ సర్జరీ ద్వారా బ్రెస్ట్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తారని వివరించారు. ప్రమాదవశాత్తు కాళ్ళు, చేతి వేళ్లు తెగిపడినప్పుడు తిరిగి అతికించడం వంటి శస్త్రచికిత్సలను కూడా ప్లాస్టిక్ సర్జరీ ద్వారానే చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం, ఆధునిక వైద్య రంగంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు డా. లక్ష్మి పలుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది నర్సింగ్ సిబ్బందితో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని చెప్పారు. అందుకోసం అధికారులంతా తపస్సులా పని చేయాలని సూచించారు. 384 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రోహిణీ, టీజీఈడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీ మియా, టీజీఎమ్మెస్ ఐడీసీ ఎగ్జిట్ ఇంజనీర్లు చలపతి రావు, డిప్యూటీ ఐఓఎఎస్‌లు, డిప్యూటీ ఐఓఎస్, ఏఈ పాల్గొన్నారు.

అధికారులు మత్స్యకారుల పురోభివృద్ధికి కృషి చేయాలి

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

సుల్తాన్ బజార్, జూలై 11: రాష్ట్ర మత్స్య శాఖను ప్రగతి మార్గంలో నడిపించి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరును తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం విజయనగర్ కాలనీ శాంతినగర్‌లోని రాష్ట్ర మత్స్య శాఖ భవనంలో కమిషనర్ ప్రియాంక ఆల అధ్యక్షతన జిల్లా స్థాయి మత్స్య శాఖ అధికారులు (డీఎఫ్‌వో)లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో మత్స్య శాఖ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారని అన్నారు. రాష్ట్రంలోని మత్స్య శాఖ అధికారులు నిబద్ధతతో పని చేసి మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన స్పష్టం చేశారు. అధికారులకు ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని, అందుకు అధికారులు సైతం కృషి చేస్తూ మత్స్యకారులకు అన్ని విధాల సహకరించాలని ఆయన ఆదేశించారు.

గోల్కొండలో వైభవంగా రెండో బోనం

- జగదాంబిక అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్న భక్తులు

భక్తుల సేవలో గోల్కొండ మైత్రి, పీస్ కమిటీ అధ్యక్షులు సిరుగుమల్లె రాజు వస్తాద్ తదితరులు

మెహిదీపట్నం జూలై 11: చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఆషాఢ మాసం రెండో బోనం పూజను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు బోనాలను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సలహాదారు సిరుగుమల్లె రాజు వస్తాద్, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్, ఈవో శ్రీనివాస్ రాజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో పూజారి సర్వేశ్ చారి, మహంకాళి ఆలయంలో పూజారి సురేష్ చారిలు భక్తులకు అర్చనలను చేశారు. గోల్కొండ మైత్రి, పీస్ కమిటీ సభ్యులు భక్తులకు సేవ లందించారు.

మహంకాళి ఆలయంలో భక్తులకు హారతి ఇస్తున్న పూజారి సురేష్ చారి